ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (తునిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 24-11-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భారతదేశంలో ఉన్న ప్రాచీనమైన పుణ్యక్షేత్రాలలో అరుణాచలం ఒకటి. మానవ శరీరంలో భౌతిక హృదయం (గుండె) ఏ స్థానంలో ఉందో ఈ భూమండలంలో అరుణాచలక్షేత్రం ఆభాగంలో ఉంది అని అరుణాచలంగురించి చెపుతారు. అరుణాచలకొండ నాకు ఇల్లు అని భగవాన్ చెప్పారు. అరుణాచల స్మరణవలన ఆయనకు జ్ఞానంకలిగింది. మన హృదయంలో ఒకనిజం ఉంది, మరణం లేని వస్తువు ఒకటి ఉంది. అది మనకు తెలియటంలేదు. దానిని తెలుసుకోవటానికి ఏదో మనకు అడ్డువస్తోంది. దానినే అహంభావన అంటున్నారు. ఈ అహంభావనను నశింపజేయటంకోసం వచ్చిన క్షేత్రమే అరుణాచలక్షేత్రం.

ప్రతీ మనిషికి వాడి అహంభావన అంటే వాడికి ఇష్టం. మనం ప్రశాంతంగా కూర్చొని ఆలోచించి చూస్తే మన అహంభావనతోనే మనం ఎక్కువ స్నేహం చేస్తాముఅని మనకు తెలుస్తుంది. స్త్రీలు అయినా, పురుషులు అయినా ఎవరైనా వారి అహంభావనను ప్రేమించుకొంటూ ఉంటారు. వారి అహంభావనకోసం జీవిస్తారు. వారి అహంభావనతోనే స్నేహంచేస్తారు. బయట స్నేహితులు లేరా అంటే అహంభావనకు అనుకూలంగాఉంటే వారు స్నేహితులు, అహంభావనకు ప్రతికూలంగా ఉంటే వారు విరోధులు రహస్యం ఇదే. బయట స్నేహితులు, విరోధులు ఇదిఅంతా నాటకమే. ఇదిఅంతా అహంభావనలోనే ఉంది. నీకు పునర్జన్మ రావటానికి కారణంకూడా అహంభావనే.

ఈరోజు అరుణాచల దీపోత్సవం, విష్ణుదేవునికి, బ్రహ్మదేవునికి నేనుగొప్ప, నేనుగొప్ప అని వివాదంవస్తే వారి వివాదం తీర్చటంకోసం పరమేశ్వరుడు ఈరోజున జ్యోతిరూపంలో వెలిసాడు. జ్యోతియొక్క ఆదినిగాని, అంతంగాని ఎవరు చూసివస్తే వారుగొప్ప అని చెప్పాడు. బ్రహ్మ, విష్ణువులకు జ్యోతియొక్క ఆది, అంతములు కనబడలేదు. దానికి ఆదిలేదు, అంతం లేదు. ఆది, అంతం కాలంలో ఉంటాయిగాని కాలాతీతమైనదానికి ఆది, అంతం ఉండదు. బ్రహ్మదేవునికి, విష్ణుదేవునికి అది అందలేదుఅంటే దానిఅర్థం మనస్సుకు, మాటకు నీ హృదయంలో ఉన్న నిజం అందదు. మనస్సును మూసుకొంటే, మాటను మూసుకొంటే నీలోపల ఉన్న నిజం అందుతుంది. పరమేశ్వరుడు మొదట జ్యోతిరూపం ధరించాడు. జ్ఞానానికి సంకేతం దీపం. దీపం బయట ఉన్న చీకటిని పోగొడుతుంది. జ్ఞానం మన హృదయంలో ఉన్న చీకటిని పోగొడుతుంది. తరువాత గిరిరూపం ధరించాడు. పూజచేయటానికి అనుకూలంగా ఉండాలికదా ఇంతపెద్ద కొండను ఎలా పూజించగలము అని విష్ణువు, బ్రహ్మ అంటే అప్పుడు లింగరూపం ధరించాడు. తొలిలింగం, ఆదిలింగం అరుణాచలలింగం. లింగంఅంటే గుర్తు. పరమేశ్వరుడు ఒకడు ఉన్నాడని గుర్తు. లింగానికి రూపం ఉందా అంటే ఉంది, అవయవాలు అవి ఉన్నాయాఅంటే లేవు. అది రూపం కాదు, అరూపం కాదు. రూపానికి, అరూపానికి మధ్య లింగరూపం ధరించాడు. ఇక్కడ ఈశ్వరుడు మూడు రూపాలలో అంటే గిరిరూపం, లింగరూపం, సిద్ధరూపాలలో ఉన్నాడు అని భగవాన్ చెప్పారు. కైలాసంలో శివుడు ఉన్నాడుఅని చెపుతారు ఇక్కడ గిరే శివుడు. వారంలో ఒకోరోజున ఈ గిరికి ప్రదక్షణ చేస్తే ఒకోఫలం ఉంది అని పురాణాలలో చెప్పారు. ఇది భగవాన్ చెప్పినది

కాదు పురాణాలలో ఉంది. కర్మఫలం ఆశించవద్దుఅని చెప్పే భగవంతుడే కర్మఫలంగురించి ఎందుకు చెపుతున్నాడు అంటే పిల్లలు బడికి వెళ్ళకపోతే మనం వారికి బెల్లంముక్క పెడతాము, ఇష్టమైన వస్తువులు ఇచ్చి వారు బడికి వెళ్ళేటట్లు చూస్తాము. వాడికి పెట్టాలని బెల్లంముక్క వాడికి ఇవ్వటంలేదు. స్కూలుకు పంపటంకోసం వాడికి బెల్లంముక్క ఇస్తున్నాము. అలాగే మనకు కర్మఫలం అంటే ఇష్టం. కర్మఫలం చెపితేగాని మనం ఆకర్షించబడము. అందువలన కర్మఫలంచెప్పి మనలను సరిచేసి మనచేత ఆపని చేయిస్తాడు. ముందు ప్రయత్నం చేయిస్తాడు. తరువాత ప్రయత్నంలేని స్థితికి తీసుకొనిపోతాడు.

పూర్వజన్మలో ఎవరైతే జ్ఞానమార్గములో సాధనచేసారో వారిని అరుణాచలేశ్వరుడు ఆకర్షిస్తాడు, చెంతకు చేర్చుకొని వారికి సిద్ధిని ఇస్తాడు అని భగవాన్ చెప్పారు. గిరిరూపాన్ని ఎవరైతే నిరంతరము స్మరిస్తున్నారో వారి అహంభావన నశిస్తుంది. దేహం ఉండగా ఎవడైతే మరణానుభవం పొందుతాడో వాడికి దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే. దేహం పడిపోయినా వాడికి లైఫ్ కంటిన్యూ అవుతుంది, శాంతి కంటిన్యూ అవుతుంది అన్నారు భగవాన్. ఇవిఅన్నీ పొడిపొడిమాటలు కాదు ఆయన అనుభవంలోనుండి తీసిచెప్పిన మాటలు. అరుణాచలంతో ఆయనకు ఉన్న అనుబంధం అపూర్వం, అద్భుతం, ఉదాత్తం. ఈ దివ్యక్షేత్రంలో, పుణ్యక్షేత్రంలో, జ్ఞానక్షేత్రంలో 54 సంవత్సరాలు ఆయన దేహం తిరుగాడింది. ఈ 54 సంవత్సరాలలోకూడా ఈక్షేత్రం విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలనే తలంపుకూడా రాలేదు అన్నారు భగవాన్. అది ఆయనకు అరుణాచలంతో ఉన్న అనుబంధం. తలంపువచ్చిన తరువాత నిగ్రహించుకోవటంకాదు అసలు తలంపే రాలేదు. ఇదిఅంతా చెప్పటంకంటే అరుణాచలేశ్వరుడే రమణుడు, రమణుడే అరుణాచలేశ్వరుడు. మీకు భగవాన్అంటే ఇష్టంకాబట్టి ఇటువంటి మాటలు చెపుతున్నారు అని అనుకోవచ్చు. ఆయనే అరుణాచలేశ్వరుడు అని చెప్పటానికి చెపుతున్నారు. 1950వ సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీ రాత్రి 8 గంటల 47 ని.లకు ఆయన శరీరం విడిచిపెట్టినపుడు ఆయనహృదయంనుండి ఒకజ్యోతి బయలుదేరి లక్షలాదిమంది చూస్తూఉండగా అరుణగిరిలో ఐక్యమయింది. అరుణగిరే రమణరూపం ధరించింది. తరువాత ఈ రూపం విడిచి మరల అరుణగిరిలో ఆయన ఐక్యమయ్యారు. ఆయన టీచింగ్చూస్తే అది సామాన్యమానవుడు చెప్పిన టీచింగ్కాదు, సాక్షాత్తు ఈశ్వరుడే ఆరూపం ధరించివచ్చి చెప్పాడని మనకు అనిపిస్తుంది.

మీఅనుగ్రహం కావాలి అని భక్తుడు భగవాన్తో అంటే నన్ను ఎవరైతే అనుగ్రహించాడో ఆదేవుడే మిమ్మల్నికూడా అనుగ్రహిస్తాడు అని చెప్పారు. ఏమీ సాధనచేయకుండా కష్టాలు లేకుండా దేవుడు అయిపోయారు. మా బాధలు, కష్టాలు మీకు ఏమి తెలుస్తాయి అని అంటే మీరు ఏదైతే బాధఅనుకొంటున్నారో, ఏదైతే కష్టం అనుకొంటున్నారో అవిఅన్నీ ఇంతకుముందు జన్మలో నేను అనుభవించి ఉండి ఉండవచ్చు అన్నారు. అంతేగాని నేను చాలాగొప్పవాడిని, పైనుండి దిగివచ్చానుఅని ఇటువంటి మాటలు ఏమీ చెప్పలేదు. ఆయనచెప్పినది విచారణామార్గం. మిమ్మల్ని అందరిని ఆమార్గం అనుసరించమని ఆయన చెప్పలేదు. మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించి తరించండి అని చెపుతున్నారు. మీరు భోజనంచేసి ఇలాగ కూర్చొంటే ఎలాగ దేశంఅంతా తిరిగి ఉపన్యాసములు చెప్పవచ్చునుకదా అని ఒకభక్తుడు భగవాన్ను అడిగారు. పనిస్థూలంగా చేస్తేనే పనిచేయటంఅని అనుకొంటున్నావు. పని సూక్ష్మంగాకూడా చేయవచ్చు. నీకు సూక్ష్మబుద్ధి లేనపుడు సూక్ష్మంగా జరిగేపని నీకు తెలియదు. జ్ఞానిచేసేపని సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. సూక్ష్మబుద్ధి ఉంటేనే అది నీకు తెలుస్తుంది. ఉపన్యాసములు, శాస్త్రములు సాధనలో మొదటిదశలో ఉన్నవారికి కొంతవరకు ఉపయోగపడతాయి. వాటిఅంతట అవి మిమ్మల్ని గమ్యానికి తీసుకొనివెళ్ళవు. మౌనం చాలా శక్తివంతమైనది. నీ అలవాట్లలోనుండి, పునర్జన్మ హేతువులలోనుండి మౌనం నిన్ను విడదీస్తుంది.

ధ్యానంయొక్క లోతులు పెరుగుతూఉంటే, మీమనస్సును ఈశ్వరునికి అర్పించటం నేర్చుకొంటే ఏ విషయాలు అయితే మిమ్మల్ని బాధపెడుతున్నాయో ఆ విషయాలనుండి మీరు బయటపడతారు. మీకు స్వేచ్ఛ కలుగుతుంది. మీ చైతన్యస్థాయి పెరిగినపుడు మీద్వారా real work జరుగుతుంది.

నీ ధ్యానంయొక్క లోతులు పెరుగుతూఉంటే నీ ఉపాధిద్వారా అనేకమంది బాగుపడతారు, శాంతిని పొందుతారు. అదే real work. కోరిక పెట్టుకొని ఇది సాధించాలిఅని అనుకొంటాము. అది సంకల్పం. పని మొదలుపెట్టి కొంతదూరం వెళ్ళిన తరువాత ఆపని అవుతుందా, అవ్వదా అనుకోవటం వికల్పం. జ్ఞానికి సంకల్పం, వికల్పం ఉండదు. ఇదిఅంతా మనస్సుయొక్క క్రియేషన్. ఈ గొడవలు, కష్టాలు, అశాంతి వీటిఅన్నింటికి మనస్సే కారణం. ఎదుటివారిని ద్వేషిస్తున్నాముఅంటే వారు మన ఆనందమునకు అడ్డుపస్తున్నారు కాబట్టి వారిని ద్వేషిస్తున్నాము. ఆనందంకోసం ఈ తిప్పలు పడుతున్నాముఅని మనకు తెలియటంలేదు. మనకు తెలిసినా, తెలియకపోయినా జీవితంఅంతా ఆనందం పొందటంకోసం ప్రయత్నం చేస్తున్నాము. ఆనందం మన హృదయంలోనే ఉంది.

భగవంతుడు నీకు భిన్నంగా లేడు. ఒకవేళ భిన్నంగా ఉన్నాడుఅని నీవు అనుకొంటే నీమనస్సును తీసుకొనివెళ్ళి ఆయనకు అర్పించు. ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకొనేవరకూ మనకు ఈ అహంభావన గొడవే సరిపోతోంది. ఇంద్రియాలు చేసేపనులు అన్నీ నేనే చేసాను అంటుంది. ఎవరు ఏపనిచేసినా అది నేనే చేసాను అంటుంది. ఇది చాలా గొడవ తెచ్చిపెడుతోంది. ఈ నేనులోనుండి విడుదల పొందటమే మోక్షం. జ్ఞానినోటినుండి ఏమాట వచ్చినా, ఏదిచేసినా అది అనుగ్రహం. ఆయనచూపు, స్పర్శ, కోపం అన్నీకూడా అనుగ్రహమే. అక్కడ ఉన్నదే అనుగ్రహం. ఉపన్యాసములు, రచనలకంటే మౌనంవలన వచ్చేశక్తి అత్యంత బలీయమైనది. పనిఅంటే నీవు బాహ్యదృష్టితో చూస్తున్నావు. నిజమైనపని లోపలఉన్న ఈశ్వరుడిద్వారానే మౌనంద్వారానే జరుగుతుంది. రామకృష్ణుడు వివేకానందుడికి సమాధిస్థితి ఇచ్చారు అంటే బయట ఉన్న రామకృష్ణుడు వివేకానంద హృదయంలోకూడా ఉన్నాడు. వివేకానందుని హృదయంలోఉన్న రామకృష్ణుడే ఆయనకు సమాధిస్థితి ఇచ్చాడు. బయట ఉన్న రామకృష్ణుడు వివేకానంద హృదయంలో ఉండిఉండకపోతే వివేకానందుడికి సమాధిస్థితి రాదు. భగవంతుడు ఏస్థాయిలో ఉండి పనిచేస్తున్నాడో అలాగే నీవుకూడా పనిచేస్తే భగవంతుడు ఆయన స్వరూపమును నీకు ఇస్తాడు, ఆయనలో ఐక్యంచేసుకొంటాడు. ఎవడి మనస్సుఅయితే హృదయాకారం చెందిందో వాడు ఉపన్యాసములు, రచనలు చేయకపోయినా ప్రపంచంఅంతా ఆయనవైపుకు ఆకర్షింపబడుతుంది.

చైతన్యం అహంభావనకు వెనకాల ఉంది. అహంభావనను వెనుకకు త్రిప్పితే అది నీకు తెలుస్తుంది. మనకు ముందుచూపేగాని వెనుక చూపులేదు. అహంభావన ముందుకు విజృంభించటానికి చూస్తోంది. నీవు ధ్యానంచేసి, జపంచేసి, విచారణచేసి అహంభావనను వెనుకకు త్రిప్పితే అక్కడే చైతన్యంఉంది. అది అహంభావనను లోపలకు లాగుకొంటుంది. అహంభావనను వెనుకకు త్రిప్పితే జీవుడు నశిస్తాడు. దేవుడు వ్యక్తమవుతాడు. ఎవరో ఇతరులు మిమ్మల్ని బాధపెడుతున్నారు అనుకొంటున్నారు మీ తలంపులే మిమ్మల్ని బాధపెడుతున్నాయి. ఒకవేళ ఇతరులు ఎవరైనా నిన్ను బాధపెట్టినప్పటికి వారు నన్ను బాధపెడుతున్నారుఅనే తలంపు మీకు లేకపోతే నీకు బాధలేదు. మనం ఇతరులకు ఉపకారం చేస్తేవారికి ఉపకారం చేసాము అనుకొంటాము. జ్ఞాని అలాఅనుకోడు ఆ సంకల్పమే ఆయనకు రాదు. ఎందుచేతనంటే ఆయన లోకానికంటే వేరుగా లేడు. కుడిచేతిలో ఉన్న వస్తువును ఎడమచేతిలోపెట్టి నేను ఉపకారం చేసాను అనుకొంటానా? అనుకోను ఎందుచేతనంటే రెండుచేతులు నావే. అలాగే అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడు

ఆయనేకాబట్టి ఆయనకు భిన్నంగా లోకంలేదు అందువలన లోకానికి ఉపకారం చేస్తున్నాను అని ఆయన అనుకోడు.

నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో దానిని తొలగించుకోవటమే నీ సాధనయొక్క గమ్యం. నీఅంతట నీవు ప్రయత్నంచేసి తొలగించుకొంటే అది జ్ఞానమార్గం. ఈశ్వరుని శరణువేడుకొని ఈ నేనులోనుండి విడుదలపొందటం భక్తిమార్గం. నీ శరీరానికి ముగింపు ఉందిగాని లోపల ఉన్న జీవితానికి ముగింపు లేదు. భగవాన్‌ది ఏమార్గంకాదు. అడిగినవారినిబట్టి సమాధానం చెప్పేవారు. ఊరక ఉండండి అని ఎక్కువగా భగవాన్ అనేవారు. బ్రహ్మంగురించి శ్రవణం చేయకుండా, ధ్యానం చేయకుండా, బ్రహ్మం పేరు వినకుండా బ్రహ్మానుభవం పొందారు. చనిపోయిన తరువాత ఏదో నేర్చుకోవటంకాదు నేర్చుకొనేది ఏదో బ్రతికుండగానే నేర్చుకోండి. చనిపోయిన తరువాత ఏమి నేర్చుకొంటావు. బ్రతికుండగానే ఈ శరీరం శవం అవ్వకముందే చనిపోవటం నేర్చుకో. కొంచంకొంచం చనిపోవటం నేర్చుకో. ఒక్కసారే చనిపోవాలంటే భయంవేస్తుంది. నీశరీరం శవంఅవ్వకముందే కొంచంకొంచం చనిపోవటం నేర్చుకొంటే ఈ శరీరం ఉండగానే జ్ఞానం వచ్చేస్తుంది. 35 మార్కులువస్తే పాసైపోతారు. 34 మార్కులువచ్చి ఆగిపోయారు అనుకోండి. ఒక్కమార్కుదగ్గర వీడిని ఆపుచేయటం ఎందుకుఅని గ్రేస్ మార్కు ఇచ్చి పాస్ చేస్తాడు. అన్ని వాసనలు పోయాయి అనుకోండి. ఏదోచిన్న వాసన మిగిలి ఉంటే మరల వీడికి పునర్జన్మ ఏమి ఇస్తాము అని అప్పుడు దేవుడు కలగజేసుకొని మోక్షస్థితిని ఇస్తాడు. వీరికి శరీరం పడిపోయిన వెంటనే మోక్షం వస్తుంది. వీరిని విదేహముక్తులు అంటారు. జీవన్ముక్తులు అంటే శరీరంలో ఉండగానే మోక్షస్థితిని పొందుతారు.

నీ శరీరం చనిపోతుంది. జీవుడు కొత్తశరీరంకోసం వెతుక్కొంటూ వెళ్ళిపోతాడు. నీకు గురువుపట్ల విశ్వాసం ఉంటే, ప్రేమ ఉంటే ఆయన అనుగ్రహ ప్రవాహం ఆయన మౌనంనుండి వచ్చేశక్తి నీవు ఎక్కడ ఉన్నప్పటికీ వచ్చి అది నీమీద పనిచేస్తుంది. వాసనలలోనుండి నిన్ను విడుదలచేయించటానికి ఆయనే ప్రయత్నంచేస్తాడు. ఆయన పట్లప్రేమకలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. గురువుమీద ప్రేమ కలుగుతోంది అంటే మన సాధనలవలన కలగటంలేదు, ఆయన అనుగ్రహంవలననే ఆయనను ప్రేమిస్తున్నాము. మనం ఏమంత సాధనలు చేసాము, త్యాగాలు చేసాము దేవునిమీద ప్రేమకలగటానికి? మనం ఏమీ చేయలేదు అయినా ఆయనమీద ప్రేమ కలుగుతోంది అంటే దీనికి కారణం ఆయన అనుగ్రహమే. మీలోఎవరైనా మాకు తెలివితేటలు ఉన్నాయి అనుకోవచ్చు. తెలివితేటలు ఒక పనిముట్టుమాత్రమే. దానిని సరిగా ఉపయోగించుకోవాలి. నీ తెలివితేటలు, చదువులు, ద్వేషాలు, ఇష్టాలు ఇవిఅన్నీ నీ మనస్సుయొక్క చేష్టలు. నీమనస్సు ఎంత నిజమో ఇవిఅన్నీకూడా అంతేనిజం.

నీదేహంలోనుండి, విషయచింతనలోనుండి నీవు విడిపోవాలి. ఎందుచేతనంటే అది నీవు కాదుకాబట్టి. నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఏదైతే నీవు కాదో దానిలోనుండి నీవు విడిపోవటం తప్పదు. మనకు అన్నింటికంటే శరీరం దగ్గరగా ఉంది. అందులో అన్నింటికంటే నేను దగ్గరగా ఉంది. ఈనేను వచ్చిన తరువాతే శరీరం మనకు తెలుస్తోంది. ఆనేనుగురించి విచారణ చేయము. ఇదేమాయ. మీరు అందరూ జ్ఞానులుఅయిపోవాలి అనుకొంటే మీకు సాధనలు, విచారణచేసే ఓపిక లేదనుకోండి, సత్పురుషుల సహవాసం చేయలేరు అనుకోండి ఈ నేనుతో స్నేహంమానివేయండి. ఇప్పుడు ఏదైతే మీకు నేనుగా వ్యక్తమవుతోందో దానితో స్నేహంమానివేస్తే ఇప్పుడే ఇక్కడే జ్ఞానులు అయిపోతారు. మీరు పెద్ద పెద్ద యోగాభ్యాసములు చేయనక్కరలేదు. ఈ నేనుతో స్నేహం మానివేస్తే ఇప్పుడే, ఈ సృష్టిలో ఉండగానే బ్రహ్మానుభవం పొందుతారు ఎందుచేతనంటే మీకు అడ్డువచ్చేది ఈ నేనే. మీరు బ్రహ్మానుభవం పొందటానికి ఏనేను అడ్డువస్తోందో దానితో స్నేహం మానివేయండి.